‘ముంపు’పై కదలిక

● రంగంలోకి పలు విభాగాల ఉన్నతాధికారులు
● 50 లక్షల లీటర్ల సంప్ నిర్మాణం, పైప్‌లైన్‌ల డయా పెంచే ప్రతిపాదన

బేగంపేట ప్రధాన రహదారిలో.. ముంపు ప్రాంతాల పరిశీలన



బేగంపేట ప్రధాన రహదారిలో ముంపు ఏరియాలను పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు



బేగంపేట ప్రధాన రహదారిలో ముంచెత్తిన వరదనీటిలో నెమ్మదిగా కదులుతున్న వాహనాలు(ఫైల్)

సనత్‌నగర్: బేగంపేట ప్రధాన రహదారిలో వాహనదారులకు నరకం చూపిస్తున్న ‘ముంపు’ సమస్యపై అధికార యంత్రాంగం ఎట్టకేలకు కదిలింది. వానొచ్చిన ప్రతిసారీ వరద నీరు బేగంపేట ప్రధాన రహదారిలోని లాగింగ్ పాయింట్ల వద్ద కుంటను తలపించే రీతిలో ముంచెత్తుతుండటం సర్వసాధారణమైంది. ఆ సమయంలో ట్రాఫిక్ పోలీసులే జీహెచ్‌ఎంసీ సిబ్బంది అవతారమెత్తి వరద నీరు వెళ్లే మార్గాలకు అడ్డుగా ఉన్న చెత్తా చెదారం, వ్యర్థాలను తొలగించి నీటిని మళ్లించడమే కాకుండా కిలోమీటర్ల మేర నిలిచిపోయే ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడం తలకు మించిన భారంగా పరిణమించడం పరిపాటిగా మారింది. వరదనీరు భారీగా నిలిచిపోతుండటంతో అటు వాహనదారులు, ఇటు ట్రాఫిక్ పోలీసులకు అగ్ని పరీక్షగా మారుతోంది.

◆ చివరకు ఈ ముంపు సమస్యపై పరిష్కారం కోసం ఆలోచించేందుకు అధికార యంత్రాంగం కదలడం శుభసూచకమే అయినప్పటికీ రాబోయే వర్షాకాలం నాటికి ఈ పనులు పూర్తి చేసే లక్ష్యంగా ముందుకు సాగితే బాగుంటుందని వాహనదారులు పేర్కొంటున్నారు.

◆ బేగంపేట ప్రధాన రహదారిలో చీకోటి గార్డెన్, నందిని హోటల్ ఎదురుగా పెట్రోల్‌బంకు, హెచ్‌పీఎస్ ఇన్ అండ్ ఔట్ గేట్లు, సివిల్ ఏవియేషన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(కార్గో) తదితర ప్రాంతాల్లో వరదనీరు నిలిచిపోతుండటంతో ప్రధాన రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అసలే ప్రధాన రహదారి.. ఒక్క నిమిషం ట్రాఫిక్ ఆగిందంటే కిలో మీటరు మేర వాహనాలు నిలిచిపోతుంటాయి. అలాంటి రహదారిలో వరద భారీగా చేరి వాహనాల వేగానికి ఒక్కసారిగా బ్రేక్ వేస్తుండటంతో ఆ ప్రభావం పంజగుట్ట వరకు పడుతుండటంతో వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుని విలవిల్లాడుతుంటారు. మొత్తానికి అధికారులు ఈ సమస్యపై దృష్టిసారించారు.

◆ నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయెల్ డేవిస్, ట్రాఫిక్–1 డీసీపీ రాహుల్ హెగ్డే, అదనపు డీసీపీ వేణుగోపాల్‌రెడ్డి, నార్త్‌జోన్ ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు, జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజినీర్ (మెయింటెనెన్స్) రత్నాకర్‌రావు, సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవికిరణ్, ఎస్‌ఈ సుబ్రహ్మణ్యం, బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాకునాయక్, టౌన్‌ప్లానింగ్ డీసీపీ సుష్మిత తదితర ఉన్నతాధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో ఆయా ప్రాంతాలను పరిశీలించారు.

50 లక్షల లీటర్ల సంప్ నిర్మాణానికి ప్రతిపాదన..

ఎయిర్ కార్గోను ఆనుకుని ఉన్న పెట్రోల్ బంకు వద్ద ప్రధాన రహదారిలో ముంపు సమస్యను పరిష్కరించే దిశగా 50 లక్షల లీటర్ల సామర్థ్యంతో సంప్ నిర్మించాలనే ప్రతిపాదన చేశారు. వరద నీటిని ఆ సంప్‌లోకి పంపి రోడ్డుపై నిల్వకుండా చేయాలనే ఉద్దేశ్యంతో అతిపెద్ద సంప్ నిర్మాణం చేపట్టాలని యోచిస్తున్నారు. సంప్ నుంచి మోటార్ల ద్వారా వరద నీటిని నాలాల్లోకి మళ్లించనున్నారు. అలాగే చీకోటి గార్డెన్ నందినీ హోటల్ వైపు పైప్‌లైన్ల సామర్థ్యాన్ని భారీగా పెంచాలని ప్రతిపాదించారు. దీంతో పాటు హెచ్‌పీఎస్ ఇన్ అండ్ ఔట్ గేట్ల వద్ద కూడా నీరు నిల్వకుండా ఉండేందుకు అక్కడ కూడా పైప్‌లైన్ల డయా పెంచాలని నిర్ణయం తీసుకున్నారు. ఆయా పనులకు త్వరలోనే టెండర్లు ఆహ్వానించాలని అధికారులు భావిస్తున్నారు. అంతకుముందు నాలాల్లో డీసిల్టింగ్ పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఏదేమైనా నగరంలోనే అత్యంత కీలకమైన రహదారుల్లో ఒకటైన బేగంపేట ప్రధాన రహదారిలో ‘ముంపు’ సమస్యలపై మొదటి అడుగు పడటంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా 15, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 23, క్యాప్సికమ్ 50, పచ్చికాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 9, క్యారెట్ 21, దొండ 23, గుండుబీన్స్ 65, గింజ చిక్కుడు 55, గోకరకాయ 35, కీర 16, దోసకాయ 18, బీట్‌రూట్ 15, ఉల్లిగడ్డ 14, ఆలుగడ్డ 25, చామగడ్డ 35, మొరంగడ్డ 23.

మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు



భానుప్రసాద్

బౌద్ధనగర్: మద్యం మత్తులో మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఓ వ్యక్తికి మూడు రోజుల జైలు శిక్ష విధించిన ఘటన వారాసిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పార్శిగుట్టకు చెందిన భానుప్రసాద్(26) స్క్రాప్ వ్యాపారి. ఇటీవల మద్యం తాగిన సమయంలో ఓ మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ మేరకు సదరు మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న వారాసిగూడ పోలీసులు భానుప్రసాద్‌ను సికింద్రాబాద్‌లోని సిటీ సివిల్ కోర్టులో మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

సనత్‌నగర్: రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతీనగర్ స్నేహపురికాలనీ కమాన్ వద్ద రోడ్డు పక్కన ఓ వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉన్నట్లు పోలీసులకు సోమవారం ఉదయం 9.50 గంటలకు సమాచారం అందింది. అక్కడికి చేరుకుని 108 వాహనం ద్వారా గాంధీ ఆస్పత్రికి తరలించారు. అయితే సదరు వ్యక్తి అదే రోజు మధ్యాహ్నం 12.38 గంటలకు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్ కారణంగానే ఆ వ్యక్తి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలోంచి గొలుసు చోరీ

సనత్‌నగర్: నిద్రిస్తున్న మహిళ మెడలో నుంచి రెండు తులాల బంగారు గొలుసును గుర్తుతెలియని వ్యక్తి లాక్కొని పరారైన ఘటన బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బేగంపేట మయూరి మార్గ్‌కు చెందిన బాల్‌రెడ్డి, కమల దంపతులు. వీరికి ఇద్దరు సంతానం కాగా కుమారుడు అంజిరెడ్డి దుబాయ్‌లో ఉండగా, కుమార్తె అర్చన తల్లిదండ్రులతో ఉంటోంది. ఈ నెల 17న మధ్యాహ్నం కమల బెడ్‌రూంలో నిద్రిస్తుండగా, ఆమె భర్త బాల్‌రెడ్డి హాల్‌లో నిద్రిస్తున్నారు. అదే సమయంలో కమల మెడలో నుంచి ఎవరో గొలుసు లాక్కొని పారిపోతుండగా కేకలు వేసింది. భర్త ఆ వ్యక్తిని పట్టుకునేందుకు విఫల యత్నం చేశాడు. దీంతో బాధితురాలు బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చోరీకి గురైన గొలుసు రెండు తులాలు ఉంటుందని ఫిర్యాదులో పేర్కొన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

సనత్‌నగర్: ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు తెలిపిన వివరాల ప్రకారం.. మోతీనగర్ అవంతినగర్‌కు చెందిన సత్యనారాయణ కుమారుడు నాగసాయి ప్రశాంత్(17) బల్కంపేటలోని ఓ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదివాడు. మంగళవారం ఇంటర్ ఫలితాలు వెలువడిన నేపథ్యంలో ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంట్లోకి చొరబడి నగదు చోరీ

సనత్‌నగర్: అందరూ నిద్రిస్తున్న సమయంలో కిటికీలో నుంచి తలుపు లోపలి గడియ తీసి గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లోని రూ.50 వేల నగదుతో పాటు విలువైన వస్తువులను దొంగిలించుకు వెళ్లిన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మోతీనగర్ స్నేహపురికాలనీలో నివసించే అంకురి వెంకటేష్(32) అసిస్టెంట్ బిల్ కలెక్టర్. ఈ నెల 18వ తేదీన రాత్రి 11.30 గంటలకు తన హ్యాండ్‌బ్యాగ్‌లో రూ.50వేల నగదు పెట్టి బెడ్‌రూమ్‌లో ఉంచి నిద్రపోయాడు. 19న తెల్లవారుజామున హాల్‌లో శబ్దం రావడంతో వెళ్లి చూడగా బయటి నుంచి తలుపు గడియ పెట్టి గుర్తుతెలియని వ్యక్తి పారిపోతున్నట్లు గమనించాడు. ఇంట్లో పరిశీలించగా రూ.50 వేలు ఉంచిన బ్యాగ్‌తో పాటు ఫాస్ట్రాక్ వాచ్, 3 గ్రాముల చెవి రింగులు, రెండు మొబైల్ ఫోన్లు కనిపించలేదు. కిటికీలో నుంచి తలుపు బోల్టు తీసి గుర్తుతెలియని వ్యక్తి లోపలికి ప్రవేశించినట్లుగా గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బంగారు మైసమ్మ ఆలయం ముస్తాబు

నేడు ఆలయ వార్షికోత్సవాలు ● భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు





బంగారు మైసమ్మ, విద్యుత్ కాంతుల్లో అమ్మవారి ఆలయ గోపురం

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి డివిజన్ మధురానగర్‌లోని బంగారు మైసమ్మ దేవాలయ 9వ వార్షికోత్సవ వేడుకలు ఈ నెల 23న నిర్వహించనున్నారు. ఇందు కోసం ఆలయాన్ని సుందరంగా ముస్తాబు చేయడంతో పాటు అధిక సంఖ్యలో హాజరయ్యే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బుధవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు తదితర ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ గుర్రం పవన్ కుమార్‌గౌడ్ తెలిపారు. ఉదయం 4 గంటల నుంచి పూజలు మొదలవుతాయి. మహా చండీయాగం, శాంతికల్యాణం తదితర ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తిరిగి సాయంత్రం 5 గంటల నుంచి కాలనీలో అమ్మవారి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. వేడుకలకు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, మాజీ మంత్రులు తీగుళ్ల పద్మారావుగౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.

యువతి ప్రాణాలు కాపాడిన పోలీసులు

కంటోన్మెంట్: ప్రేమించిన వ్యక్తితో పెళ్లి వాయిదా వేస్తున్నారన్న కోపంతో ఇంటి నుంచి పారిపోయి, ఆత్మహత్యకు పాల్పడాలని అనుకున్న యువతిని బోయిన్‌పల్లి పోలీసులు కాపాడారు. బాధిత యువతి తల్లిదండ్రులు ఫిర్యాదు చేసిన రెండు గంటల్లోనే ఆమెను కాపాడారు. ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్‌కు చెందిన రాణి, చంద్రయ్య దంపతులు కుమార్తె నాన్సీ(25), కుమారుడు ఫ్రెడ్రిక్‌తో కలిసి ఓల్డ్ బోయిన్‌పల్లి మల్లికార్జున్‌నగర్‌లో నివాసం ఉంటున్నారు. నాన్సీ అదే ప్రాంతంలో ఉండే రాజస్థాన్‌కు చెందిన అన్షుమన్‌తో ప్రేమలో పడింది. ఇరు కుటుంబాలు పెళ్లికి అంగీకరించారు. వీరి వివాహం రాజస్థాన్‌లో జరిపిస్తామని అన్షుమన్ కుటుంబ సభ్యులు తెలిపారు. అయితే అంతదూరంలో పెళ్లి జరిపించడం ఇష్టం లేని నాన్సీ తల్లిదండ్రులు, అనారోగ్య కారణాలు చూపుతూ పెళ్లి వాయిదా వేయాల్సిందిగా సూచించారు. పెళ్లి చేసే ఉద్దేశం లేకే వాయిదా వేస్తున్నారంటూ తల్లిదండ్రులతో నాన్సీ గొడవపడింది. సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. వెంటనే నాన్సీ తల్లి రాణి బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో నాన్సీ ఫోన్ చేసి తాను చనిపోతున్నానంటూ చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. బోయిన్‌పల్లి పోలీసులు సెల్‌ఫోన్ ఆఖరి సిగ్నల్స్ ఆధారంగా ఆమె ట్యాంక్‌బండ్ పరిసరాల్లో ఉన్నట్లు గుర్తించారు. రాత్రి 11.30 గంటల సమయంలో ఆమెను తల్లిదండ్రులకు అప్పగించారు.

ఘనంగా ఉద్యోగ విరమణ సత్కారం



తాటిపద్మను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

సికింద్రాబాద్: సీతాఫల్‌మండి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయురాలు తాటి పద్మ ఉద్యోగ విరమణ సత్కారం మంగళవారం ఘనంగా జరిగింది. సీతాఫల్‌మండి మల్టీపర్పస్ ఫంక్షన్ హాలులో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు నిర్వహించిన తాటి పద్మ సత్కార కార్యక్రమానికి ముషీరాబాద్ మండల విద్యాధికారి శ్రావణ్, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బారావు, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా తాటి పద్మ ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా అందించిన బోధనలు, తెలుగుభాష పరిరక్షణ కోసం చేసిన సేవలను కొనియాడారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేబీ జయలక్ష్మి, ఉపాధ్యాయ ప్రతినిధులు శోభారాణి, డాక్టర్ రమేశ్, పద్మజ, సుజాత తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు అధ్యాపకుల వినూత్న నిరసన



మాట్లాడుతున్న మహేశ్వర్‌రెడ్డి

ఉస్మానియా వర్సిటీ క్యాంపస్‌లో చేతికి సంకెళ్లతో ర్యాలీ

ఉస్మానియా యూనివర్సిటీ: కాంట్రాక్ట్ అధ్యాపకులు వినూత్న నిరసనకు దిగారు. ఉద్యోగాలను పర్మనెంట్ చేయాలని నాలుగు రోజులుగా విధులు బహిష్కరించి నిరవధిక సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. తాజాగా మంగళవారం ఓయూ కాంట్రాక్టు అధ్యాపకులు చేతికి సంకెళ్లు వేసుకొని ర్యాలీ నిర్వహించారు. శాంతియుతంగా సమ్మె చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను ఈ నెల 21న అక్రమంగా అరెస్ట్ చేసినందుకు నిరసనగా ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ నుంచి పాలన భవనం వరకు ఈ ర్యాలీ చేపట్టినట్లు అధ్యాపకులు పేర్కొన్నారు. వైస్ చాన్స్‌లర్ పాలన భవనం ఎదుట ఏర్పాటు చేసిన టెంట్ కింద ఓయూతో పాటు వీరనారి చాకలి ఐలమ్మ మహిళా వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకులు నిరవధిక సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్టు అధ్యాపకులు డాక్టర్ పరశురామ్, డాక్టర్ సీమర్ల విజేందర్‌రెడ్డి, డాక్టర్ ఉపేందర్, డాక్టర్ వేల్పుల కుమార్, డాక్టర్ మహేశ్వర్‌రెడ్డి, డాక్టర్ ధర్మతేజ, డాక్టర్ తిరుపతి, డాక్టర్ రేష్మారెడ్డి, డాక్టర్ కవిత తదితరులు పాల్గొన్నారు.

నేడు చలో ఉస్మానియా

రాష్ట్రంలోని 12 వర్సిటీల్లో పని చేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యులరైజ్ చేయాలని అధ్యాపకులు బుధవారం ‘చలో ఉస్మానియా’కు పిలుపునిచ్చారు. గత ఏడాది నుంచి వివిధ రూపాల్లో ఆందోళనలు చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో చలో ఉస్మానియా కార్యక్రమానికి పిలుపు ఇచ్చినట్లు జేఏసీ నాయకులు డాక్టర్ తాళ్లపల్లి వెంకటేశం, డాక్టర్ కృష్ణయ్య, డాక్టర్ వినత పాండే, డాక్టర్ చెన్నగౌడ్, డాక్టర్ పాండయ్య, డాక్టర్ వెంకటేష్ తెలిపారు.

బీఆర్‌ఎస్ చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణ



చలో వరంగల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

సనత్‌నగర్: వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలివెళ్లాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ పిలుపునిచ్చారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన కార్యాలయం వద్ద పద్మారావునగర్ ఇన్‌చార్జి గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో రూపొందించిన చలో వరంగల్ పోస్టర్‌ను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ మంగళవారం ఆవిష్కరించారు. అనంతరం నియోజకవర్గ పరిధిలోని బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి భారీగా వాహనాల్లో ఎల్కతుర్తికి సభ ఏర్పాట్ల పరిశీలన కోసం తరలివెళ్లారు.

సమ్మర్ క్యాంప్ ప్రారంభం

లాలాపేట: తబితా ఉమెన్ అండ్ చిల్డ్రన్ సర్వీస్ ఆశ్రమం ఆధ్వర్యంలో మంగళవారం సమ్మర్ క్యాంప్ ప్రారంభమైంది. శాంతినగర్‌లోని బెత్లెహేమ్ ఎవాంజలికల్ బాప్టిస్టు చర్చి సహకారంతో ఈ నెల 26 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు ఆచార్య ఆహరోన్ తీగుళ్ల తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 6.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే ఈ క్యాంప్‌లో యోగాసనాల ప్రాక్టీస్, వ్యక్తిత్వ వికాసం అంశాలను బోధిస్తారు. పిల్లలకు అల్పాహారం, లంచ్ అందజేస్తున్నారు. ఆశ్రమ డైరెక్టర్ ఏలిషమ్మ, యాదమ్మ, శిరీష తదితరులున్నారు.

పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళి

రాంగోపాల్‌పేట్: వాటికన్ సిటీలో కన్నుమూసిన పోప్ ఫ్రాన్సిస్‌కు కార్డినల్ పూల ఆంథోని ఘనంగా నివాళులర్పించారు. సికింద్రాబాద్ సెయింట్ మేరీస్ చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొని పోప్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆధ్యాత్మికంగా, సామాజికంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు పాల్గొన్నారు.

సెయింట్ మేరీస్ ఎంబీఏ కళాశాలలో..

పోప్ ఫ్రాన్సిస్‌కు సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్ ఎంబీఏ కళాశాలలో మంగళవారం నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ వినయ్ ఆంటోని ఆధ్వర్యంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బందితో పాటు విద్యార్థులు నివాళులర్పించారు.



పోప్ ఫ్రాన్సిస్‌కు నివాళులర్పిస్తూ..

పౌష్టికాహారంపై అవగాహన

బంజారాహిల్స్: అంగన్‌వాడీ కేంద్రాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న పోషణ పక్షోత్సవాలు మంగళవారంతో ముగిశాయి. ఐసీడీఎస్ ఖైరతాబాద్ జోన్ పరిధిలోని ఫిలింనగర్ గౌతమ్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో స్థానిక 10 అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు ముగింపు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి హాజరైన జిల్లా సంక్షేమ అధికారులు గర్భిణులకు పోషకాహారంపై అవగాహన కలిగించారు. తమ ఇంట్లోనే వండుకునే పదార్థాల్లో పోషక విలువలు ఉన్న ఆహారాన్ని వివరించారు. ఫిలింనగర్ 18 బస్తీలకు చెందిన గర్భిణులతో పాటు తల్లులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

26న బ్రిడ్జిగ్యాప్ మార్కెటింగ్ కాన్‌క్లేవ్

సనత్‌నగర్: బ్రిడ్జ్‌గ్యాప్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీన అమీర్‌పేట మ్యారీగోల్డ్ హోటల్‌లో ‘బ్రిడ్జ్‌గ్యాప్ మార్కెటింగ్ కాన్‌క్లేవ్’ను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ఫౌండర్ విపిన్‌సింగ్ తెలిపారు. ఔత్సాహిక యువ పారిశ్రామికవేత్తల కోసం ప్రత్యేకంగా ఈ కాన్‌క్లేవ్‌ను రూపొందించినట్లు పేర్కొన్నారు. మార్కెటింగ్, బ్రాండింగ్, ప్రకటనలతో సంప్రదాయ వ్యాపారాలు ఏవిధంగా ముందుకు వెళ్లాలో ఈ కాన్‌క్లేవ్ ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు తెలియజేయడం జరుగుతుందన్నారు. సంప్రదాయ విధానాలను ఆధునిక వ్యూహాలతో మేళవించేలా ఈ వేదిక నిలవనుందన్నారు. అలాగే స్కేలింగ్ ఎక్రాస్ జనరేషన్ ద్వారా వ్యాపారాన్ని ఎలా అభివృద్ధి చేయాలి..? తప్పులను ఎలా నివారించాలి..? అనే అంశాలపై విలువైన సమాచారం అందిస్తామని వివరించారు. ది బ్రాండ్ ప్లేబుక్ సెషన్‌లో నిపుణులు, ప్రముఖ బ్రాండ్‌ల విజయగాథలు, అంతర్గత వ్యూహాలు, అనుభవాలపై లోతుగా చర్చించనున్నట్లు తెలిపారు. బిజినెస్ ఇన్నోవేషన్‌పరంగా ఎన్నో ఆలోచనాత్మక సెషన్లు కూడా ఈ కాన్‌క్లేవ్‌లో ఉంటాయన్నారు. నిపుణులైన ఫ్యాకల్టీ బృందం దీనికి నేతృత్వం వహిస్తుందని తెలిపారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న జీహెచ్‌ఎంసీ అధికారులు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పద్మారావునగర్ ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్ ఆక్రమణలను జీహెచ్‌ఎంసీ అధికారులు మంగళవారం తొలగించారు. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది పెద్ద ఎత్తున పద్మారావునగర్ ప్రధాన రహదారిలోని సీక్రెట్ కిచెన్, ఏషియన్ వైన్స్ ప్రాంతాల్లో ఈ కూల్చివేతలను చేపట్టారు. చాలా కాలం నుంచి ఫుట్‌పాత్‌లను ఆక్రమించి పలువురు పెద్ద ఎత్తున వ్యాపారాలు చేస్తున్నారు. దీంతో పాదచారులు రోడ్డుపై నుంచి వెళ్తూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికే అనేక మందికి గాయాలు కాగా పలువురు మృత్యువాత పడ్డారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఏర్పాటు చేసిన షెడ్లు, ప్రహరీగోడ, ఇతర నిర్మాణాలను జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తొలగించారు. ఆక్రమణలను తొలగించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ సిబ్బందిని అభినందించడం కనిపించింది. ఫుట్‌పాత్ ఆక్రమణలను ఉపేక్షించే ప్రసక్తే లేదని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ సిటీ ప్లానర్ సుష్మిత చెప్పారు. ప్రజలకు ఇబ్బంది కలిగించే నిర్మాణాలు, ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎంకు గుణపాఠం చెప్పాలి

అమీర్‌పేట: హిందూ ముస్లింల మధ్య గొడవలు సృష్టించి అభివృద్ధికి ఆటంకం కలిగించే ఎంఐఎం పార్టీని ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓడించాలని బీజేపీ నేతలు, కార్పొరేటర్లు పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్ బీజేపీ కార్పొరేటర్లతో కలిసి అమీర్‌పేటలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంఐఎం పార్టీ గుణపాఠం చెప్పాలని అన్నారు. జాతీయ వాదం, ధర్మం కోసం పనిచేస్తున్న బీజేపీ అభ్యర్థి గౌతమ్‌రావును గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఎంఐఎంకు తొత్తులుగా మారాయని విమర్శించారు. పైగా ఓటింగ్‌కు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకోవడమంటే రజాకార్లకు మద్దతు తెలిపినట్లే అని పేర్కొన్నారు. కార్పొరేటర్లు కేతినేని సరళ, రచనశ్రీ,దీపిక, చీర సుచరిత తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో మెరిసిన గురుకుల విద్యార్థులు

కంటోన్మెంట్: మహేంద్రాహిల్స్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కాలేజీ విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ఉత్తమ ఫలితాలు సాధించారు. సెకండ్ ఇయర్‌లో 77 మందికి గానూ 76 మంది ఉత్తీర్ణత సాధించారు. వీరిలో ఎంపీసీలో డి.మమత(992), టి.మౌనిక(991), బైపీసీలో బి.ప్రవళిక(991), జి.సుశీల(989) రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. ఫస్ట్ ఇయర్‌లోనూ 76 మందికి గానూ 74 మంది ఉత్తీర్ణులయ్యారు. ఎంపీసీలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించగా, కె.శ్రుతి(467), బి.శ్రీచన, డి.పూర్ణిమ(466), బైపీసీలో ఎం.సంప్రీతి(437), జి.తేజస్విని(436) రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ శీలం సునీత అభినందించారు. అత్యుత్తమ ప్రమాణాలతో కూడిన బోధన, నిరంతర శిక్షణ కారణంగానే తమ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు తెలిపారు.

కాలేజీ స్థాపించిన తొలి ఏడాదిలోనే..

వెస్ట్‌మారేడుపల్లిలోని మెడ్జీ కళాశాల విద్యార్థులు ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఫస్ట్ ఇయర్ ఫలితాల్లో ఎంపీసీలో ఆరుగురు విద్యార్థులు 470కి గానూ 460కి పైగా మార్కులు సాధించారు. సాయికీర్తి(466), వాసవి(465), బైపీసీలో సైదా ఆరిజా సిద్దిఖీ(436/440) మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారు. పేదలు, మధ్యతరగతికి అందుబాటులో ఉండే ఫీజులతో నిర్వహిస్తున్న తమ కాలేజీ విద్యార్థులు తొలి ప్రయత్నంలోనే ఉత్తమ ప్రతిభ కనబరచడం సంతోషాన్ని కలిగిస్తోందని కాలేజీ డైరెక్టర్ పి.వెంటకేశ్వరరావు, ప్రిన్సిపాల్ కె.భార్గవి తెలిపారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న స్వీకార్ సంస్థ యాజమాన్యం

నూరు శాతం ఉత్తీర్ణతతో స్వీకార్ దివ్యాంగుల రికార్డు

కంటోన్మెంట్: ఇంటర్మీడియెట్ ఫలితాల్లో స్వీకార్ సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దివ్యాంగుల జూనియర్ కళాశాలలో బధిర విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఎంఈసీ, సీఈసీకి సంబంధించి సెకండ్ ఇయర్‌లో 49 మంది, ఫస్ట్ ఇయర్‌లో 41 మంది విద్యార్థులు పరీక్ష రాయగా, అందరూ ఉత్తీర్ణులయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్వీకార్ సంస్థ చైర్మన్ డాక్టర్ పి.హన్మంతరావు, ఉపాధ్యక్షురాలు నిర్మల హన్మంతరావు, ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్‌రావు ప్రత్యేకంగా అభినందించారు. తమ సంస్థ ఇంటర్మీడియెట్ కాలేజీలో 24 ఏళ్లుగా నూరుశాతం ఉత్తీర్ణతతో రికార్డు ఫలితాలు సాధిస్తోందన్నారు. దివ్యాంగులకు సరైన రీతిలో శిక్షణ ఇస్తే అద్భుత ఫలితాలు సాధిస్తారని చెప్పేందుకు తమ విద్యార్థులే చక్కటి ఉదాహరణ అన్నారు.



లక్ష్య విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

సత్తాచాటిన లక్ష్య విద్యార్థులు

సాక్షి, సిటీబ్యూరో: లక్ష్య జూనియర్ కళాశాల విద్యార్థి ఎంఈసీలో రాష్ట్రస్థాయిలో మొదటి సంవత్సరం, రెండవ సంవత్సరంలో రెండో ర్యాంక్ సాధించారు. ఎస్సార్‌నగర్‌లోని లక్ష్య జూనియర్ కళాశాల విద్యార్థి చరితరెడ్డికి ఎంఈసీ 2వ సంవత్సరంలో 988/1000 మార్కులతో స్టేట్ రెండో ర్యాంక్ సాధించగా, ప్రియాంకరెడ్డి, సుచితారెడ్డి, అతులిత్, ప్రియాంషు, భాను ప్రకాష్, నేహా వర్ధినికి ఎంఈసీ 1వ సంవత్సరంలో 495/500 మార్కులతో రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంక్ సాధించారు. వీరిని కళాశాల చైర్మన్ సీఏ మురళీ వైట్ల, డైరెక్టర్ ఎస్.శివప్రసాద్‌రెడ్డి ఘనంగా సత్కరించారు.